క్లుప్తంగా

ఇండియన్ బ్యాంక్ బ్రాంచి ప్రారంభం



మచిలీపట్నంఅర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డీకె బాలాజీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ నుంచి చిలకలపూడి వెళ్లే దారిలో స్విమ్మింగ్‌పూల్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంక్ చిలకలపూడి బ్రాంచ్ ను కలెక్టర్ డీకె బాలాజీ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు పేదలకు ఆర్థికాభివృద్ధి అందించే విధంగా రుణాలు అందించాలన్నారు. విజయవాడ జోనల్ మేనేజర్ రాజేష్, డెప్యూటీ జోనల్ మేనేజర్ రామారావు, ఎల్‌డీఎం రవీంద్రరెడ్డి, చిలకలపూడి బ్రాంచ్ మేనేజర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక చట్టాలు తెలిసి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి భాస్కరరావు



బంటుమిల్లి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ప్రాథమిక చట్టాలు తెలుసుకుని ఉండాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. మండల పరిధిలోని అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలబాలికలు అందరు ఫోక్సో చట్ట పరిధిలో ఉంటారన్నారు. పాఠశాల స్థాయి పిల్లలందరూ పాఠశాలలో ఉండి చదువుకోవాలని చదువు మాని ఇతర పనులకు వెళితే బాల కార్మిక చట్ట పరిధిలోకి వస్తారని, ఈ చట్టం విద్యార్థులకు రక్షణ ఇస్తుందన్నారు. పాఠశాల, కాలేజీల్లో తెలిసీతెలియని వయస్సులో తీసుకోవలసిన జాగ్రత్తలపైన, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్ గురించి ఆయన వివరించారు. పాఠశాల వయస్సులో సెల్‌ఫోన్ వినియోగం తక్కువగా ఉండాలని సూచించారు. హెచ్ఎం సీహెచ్.రామచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకాలు

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీగణపతి సహిత శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరునికి గురువారం రాత్రి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజ ఘనంగా జరిపారు. ఆలయ ముఖ మండపంలో టి.భరత్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో తొలుత ధర్మకర్త పూషడపు నిరంజనరావు–శివసత్యవతి దంపతులు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ నందీశ్వరునికి ఆవు పాలు, ఆవు పెరుగు, నెయ్యి, తెనె పంచదార, పళ్లరసాలు, పసుపు, కుంకుమ, విభూది, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. పలువురు గ్రామస్తులు భక్తులు కూడా నందికి అభిషేకాలు జరిపారు. తదుపరి నందీశ్వరుడికి శివయ్యకు ప్రత్యేక అలంకారం చేసి శాస్త్రోక్త పూజ జరిపి ఈ ఇరువురి నడుమ ఏక కాలంలో విశేష హారతి ఇచ్చి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

సీసీ కెమేరా ఏర్పాటు చేసిన యువత

చల్లపల్లి: రాత్రి సమయాల్లో రోడ్ల వెంబడి మద్యం సేవించేవారిని ఇతర ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని నిరోధించేందుకు మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు చింతలమడ యువత నడుం బిగించారు. స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకుని లక్ష్మీపురం నుంచి తమ గ్రామానికి వచ్చే రెండు రోడ్లు విడిపోయే 'వై జంక్షన్' పాయింట్ వద్ద సీసీ కెమేరాను ఏర్పాటు చేసుకున్నారు. 360 డిగ్రీల కోణంలో తిరిగే ఈ కెమేరాతో సెల్‌ఫోన్ యాక్సెస్ ద్వారా రాత్రీ, పగలూ సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుందని యువకులు చెప్పారు. ఇది పూర్తిగా సోలార్ పవర్‌పై ఆధారపడి పనిచేస్తుందన్నారు. రోడ్లపై అల్లరి మూకలు చేరి మద్యం సేవిస్తూ ఉండటంతో రాత్రిళ్లు ఊర్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారని, రోడ్ల వెంబడి బహిరంగ మల విసర్జనలు ఈ రెండింటినీ పూర్తిగా అరికట్టేందుకే ఈ కెమేరాను ఏర్పాటు చేశామని యువకులు చెప్పారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు

బంటుమిల్లి: ఐపీఎల్ క్రికెట్టు బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గణేష్ కుమార్ క్రికెట్టు అభిమానులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక లక్ష్మీపురం సెంటర్లో క్రికెట్టు బెట్టింగ్‌లపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, తెలిసీ తెలియక బెట్టింగ్‌ల ఆశ చూపి పందేలరాయుళ్లు మన ఖాతాల నుంచి డబ్బులు దోచుకుంటారని హెచ్చరించారు. క్రికెట్టు ఆట వినోదానికే పరిమితం కావాలని బెట్టింగ్‌లు చట్ట రిత్యా నేరమని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

యూపీహెచ్‌సీ త్రీఫేజ్ విద్యుత్‌కు మోక్షం

- గతంలో రూ.కోటితో భవనం నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- త్రీఫేజ్ విద్యుత్ లేక నిలిచిన రక్త పరీక్షలు
- రూ.3.18 లక్షలు మంజూరుతో త్వరలో సమస్యకు పరిష్కారం





పెడన యూపీహెచ్‌సీ (ఇన్‌సెట్) యూపీహెచ్‌సీలో రక్త పరీక్షల ల్యాబ్‌లో పరికరాలు

పెడన: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించేలా చర్యలు చేపట్టింది.

రూ.కోటితో యూపీహెచ్‌సీ..

అందులో భాగంగానే పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (అర్బన్ హెల్త్ సెంటరు) కోటి రూపాయాలతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. 2023 జూన్‌లో అప్పటి మంత్రి జోగి రమేష్ దీనిని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 14 రకాల రక్త పరీక్షలతో పాటు 78 రకాల మందులను అందుబాటులో ఉంచింది. వైద్య సిబ్బంది కొరతను అధిగమించి రోగులకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక..

ఈ ఆసుపత్రిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక అత్యాధునిక పరికరాలు సమకూరినా నిరుపయోగంగా పడి ఉన్నాయి. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా కోసం సంబంధిత శాఖాధికారులకు, పురపాలక సంఘ అధికారులకు విన్నవిస్తూ వచ్చారు. ఆ తరువాత ప్రభుత్వం మారింది.

అందుబాటులోకి రాని రక్త పరీక్షలు..

ఆసుపత్రిలో పరీక్షలు చేయడానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో సంబంధిత పరికరాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. అత్యవసరం అయితే తప్ప వాటిని వినియోగించడం లేదు. ఇక్కడకు వచ్చేవారంతా చిన్నపాటి రక్త పరీక్షలు తప్ప పెద్దవి చేయించుకోవాలంటే పెడన పీహెచ్‌సీకి సిఫార్సు చేస్తున్నారు. కొందరు యూపీహెచ్‌సీకి రాకుండా నేరుగా పెడన పీహెచ్‌సీకి వెళ్లిపోతున్నారు.

జిల్లా కలెక్టర్ చొరవతో..

ఈ విషయాన్ని పలు దఫాలుగా జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లడంతో ప్రస్తుతం రూ.3.18 లక్షలు వైద్యారోగ్యశాఖ నిధులు కేటాయించింది. దీంతో పురపాలక సంఘానికి నిధులు రావడంతో వాటిని విద్యుత్ శాఖకు త్వరలో పంపించి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోనున్నారు.

అంతా సిద్ధం చేశాం..



పెడన అర్బన్ హెల్త్ సెంటరుకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కోసం నిధులు మంజూరయ్యాయి. రూ.3.18 లక్షలు వచ్చాయి. వీటిని విద్యుత్‌శాఖ వారికి పంపిస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ బిగించడానికి కూడా ఆసుపత్రి వద్ద సిమెంటు దిమ్మను నిర్మించాం. విద్యుత్ శాఖకు నిధులు వెళ్లగానే వారు పనులు మొదలు పెట్టి ఆస్పత్రికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇస్తారు.

– సీతారామాంజనేయులు, ఏఈ, పురపాలక సంఘం, పెడన

సర్వర్ సమస్యతో సతమతం

50 శాతం వడ్డీ రాయితీ చెల్లించేందుకు ఇబ్బందులు



పన్ను చెల్లింపు కౌంటర్ వద్ద పడిగాపులు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. పన్నులు చెల్లించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద సర్వర్ సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వర్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఇక్కడి సిబ్బందికి కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పన్నులు చెల్లించేందుకు వచ్చిన వారు కౌంటర్ల వద్దే పడుగాపులు పడుతున్నారు. సర్వర్ కలిస్తే పన్నులు చెల్లించి వెళుతున్నారు. సర్వర్ సమస్య ఇటీవల కొద్ది రోజులుగా ఉన్నా శుక్రవారం మరింతగా పెరగటంతో కౌంటర్‌లో పని చేసే సిబ్బంది కూడా అసహనానికి గురికావల్సివస్తోంది. సర్వర్ సక్రమంగా పని చేస్తే తమ విధులు సక్రమంగా చేస్తామని, ఇప్పుడు ప్రజలను నిలబెట్టాల్సివస్తోందని సిబ్బంది వాపోతున్నారు. పన్నులపై ఉన్న వడ్డీకి 50 శాతం రాయితీ ఇచ్చిన ప్రభుత్వం సర్వర్ సమస్య తీర్చకపోవటంతో పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. వడ్డీ రాయితీ ప్రకటించిన తర్వాత చెల్లింపులు పెరిగిన నేపథ్యంలో సర్వర్ సమస్య ఇటు చెల్లింపుదారులకు, సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఆస్తి, ఖాళీస్థలాల పన్నులు చెల్లించేందుకు సీడీఎంఏ యాప్ ఉన్నా దీనిపై సరైన ప్రచారం లేకపోవటం, ఒక వేళ తెలిసినా చెల్లింపులు సులువుగా లేకపోవటంతో దీని ద్వారా చెల్లింపులకు ప్రజలు మొగ్గు చూపటం లేదు.

950 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో పీడీఎస్ డీటీ ఖాసీమ్, షెడ్ యజమాని

తలగడదీవి(నాగాయలంక): మండలంలోని తలగడదీవి శివారు బర్రంకుల వంతెన సమీపంలోని ఓ షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 కట్టలు (సుమారు 950 కేజీలు) రేషన్ బియ్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు పీడీఎస్ డెప్యూటి తహసీల్దార్ ఖాసిమ్ బాబు చెప్పారు. తమకు రాబడిన సమాచారం మేరకు రోడ్డు పక్కన పొలాల్లో ఉన్న షెడ్‌లో రేషన్ బియ్యం నిల్వ ఉన్న విషయం రూఢీ చేసుకున్న మీదట షెడ్ యజమాని భోగాది సోమశేఖర్‌ను పిలిపించి పంచనామాతో తాళాలు పగులగొట్టామన్నారు. బియ్యం సోమశేఖర్ షెడ్‌లోనే లభ్యమైనందున వాటిని స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేసి, స్టాక్‌ను తలగడదీవి గ్రామంలోని రేషన్ డీలర్ భోగాది భార్గవి (షాపు నంబరు 0635013)కు అప్పగించామని పీడీఎస్ డీటీ చెప్పారు.

కుట్రతో ఇరికించాలనే ప్రయత్నం..

అయితే యజమాని నా షెడ్‌లో మినుములు నిల్వ చేసుకున్నానని రేషన్ బియ్యం ఎలా వచ్చాయో తెలియదన్నారు. తలుపునకు వేసిన తాళం కూడా మాది కాదని, ఎవరో పగులకొట్టి కొత్త తాళం వేసి ఉంటారని తెలిపాడు. మండలంలో అక్రమంగా రవాణా రేషన్ బియ్యాన్ని పట్టిస్తున్నందునే ఇలా ఇరికించారని ఆరోపించాడు. పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐకి ఫిర్యాదు చేశామని తెలిపాడు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నిరసన



విద్యుత్ శాఖ డీఈ నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చల్లపల్లి: విద్యుత్ పంపిణీని ప్రైవేటు పరం చేయటాన్ని నిరశిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యద్దనపూడి మధు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ మీటర్లు బిగించటం అంటే భవిష్యత్తులో ప్రజల నెత్తిన మరింత భారాన్ని పెంచేందుకేనన్నారు. సామాన్య ప్రజలను మరింత ఇబ్బందుల్లోకి నెట్టే అదానీతో 25 సంవత్సరాల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలని, సర్దుబాలు చార్జీలు, విద్యుత్ భారాలు తగ్గించాలని కోరారు. సెకీ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్‌శాఖ డీఈ పులి నాగమల్లేశ్వరరావుకు సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరిముల్లా, బళ్ల వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు వెనిగళ్ల వసంతరావు, రామచంద్రరావు, యద్దనపూడి సుబ్రహ్మణ్యం, షేక్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: విద్యుత్ అదనపు ఛార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మోపిదేవి సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన, ధన్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల పార్టీ కార్యదర్శి చిరివెళ్ల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకముందు అదాని స్పాట్ మీటర్లుకు వ్యతిరేకంగాను, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా మాట్లాడిన టీడీపీ కూటమి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత అదే సంస్కరణలు అమలు చేస్తూ, స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, లేనప్పుడు ఒక మాట మాట్లాడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సర్‌చార్జీల పేరుతో ట్రూ అప్ ఛార్జీలు ఇప్పటికే ప్రజల నుంచి లక్షల రూపాయాలు గుంజుకుంటున్నారని, ఇప్పటికైనా గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు బెజవాడ నాగేశ్వరావు, దోనే సహదేవుడు, కర్ర వెంకటేశ్వరావు, బండి నిర్మల, పులివర్తి నాగమల్లేశ్వరావు, కొమ్ము జయరావు, మరీదు సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తు చార్జీలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు స్థానిక లక్ష్మీపురం సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఆప్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆదాని విద్యుత్తు ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. నాయకులు ఎం.శ్రీనివాసరావు, జీ నాగేశ్వరరావు, బి.నాగరాజు, పి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథిరావు



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథిరావు

గూడూరు: రైతులు ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసేలా చైతన్యం తీసుకురావాలని కృష్ణాజిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథిరావు కోరారు. కేపీపీ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం తరకటూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రుతుపవనాలు రాకముందే పొలాల్లో పిల్లిపెసర, జనుము, జీలుగ తదితర 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను (పీఎండీఎస్) వేయడం ద్వారా భూతాపాన్ని తగ్గించడంతో పాటుగా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. తద్వారా పంటలు బాగా పండి అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులకు ఖర్చు తగ్గటంతో పాటుగా అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. పశువులకు కూడా మేత కొరత ఉండదని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ఆంజనేయ కుమార్, ఏపీఎం రాజగోవింద్, మోడల్ మేకర్ ట్రైనర్ ఓ.స్వామి బాబు, పి.భూలక్ష్మి, జె.సోమేశ్వ రమ్మ, వీఏఏలు, వీఏఓలు, ఐసీఆర్పీలు, గ్రామ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోపిదేవి: ప్రకృతి పద్ధతిలో వ్యవసాయం చేపట్టాలని ఎంపీపీ రావి దుర్గావాణి రైతులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, నాచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో రైతులు, డ్వాక్రా సంఘ మహిళలకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదుస్స నిర్వహించారు. క్రిమి సంహారక మందుల వాడకం వల్ల జరిగే అనార్థాలను వివరిస్తూ సాగు చేపట్టాలను కోరారు. పెరట్లోనే కూరగాయలు సాగు చేసి బలవర్ధకమైన, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవచ్చునని తెలిపారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఈవోపీఆర్డీ త్రిపుర సుందరి, సీఎస్ఎఫ్ మేనేజర్ కృష్ణార్జున్, సీసీ హేమంత్ కుమార్, మోపిదేవి, నాగాయలంక ఏవోలు కె.హెప్సిబారాణి, సంజీవ్‌కుమార్, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, ఏపీఎం, పలువురు రైతులు, డ్వాక్రా సంఘం మహిళ సీసీ, వీఏఏలు పాల్గొన్నారు.

ఘంటసాల: ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ – 2025 కార్యాచరణ ప్రణాళికపై వెలుగు కార్యాలయంలో మండల స్థాయి సమావేశం, అవగాహన సదస్సు మండల వ్యవసాయశాఖాధికారి కె.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అవలంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌చార్జి ఏపీఎం టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామైఖ్య సంఘాలలోని మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకులు జి.గంగరాజు, సీసీలు ఎం.ఝాన్సీ, నరసమ్మ, నాగేశ్వరమ్మ, ఏసీ జానకి, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జిలు ఎస్.నాగరాజు, జి.వీర వెంకట్రావు, సిబ్బంది, వీఓఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



పెడన: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ గంగాధరరావు గురువారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో పెడనలో రెండు వర్గాల నడుమ జరిగిన ఘర్షణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ పెడనపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా స్వయంగా వచ్చి పరిశీలించడం విశేషం. పోలీస్ పికెట్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయి, ఎంత మంది సిబ్బంది ఉంటున్నారు, తదితర విషయాలపై ఆరా తీశారు. పలు సూచనలు ఇస్తూ ఆదేశించారు. మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఎనర్జీ అసిస్టెంట్ మృతి

పెడన: మండల పరిధిలోని పెనుమల్లి గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ధారవతు గోపాలరావు ఈ నెల 24న విద్యుత్ షాక్ గురవగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 24న పెనుమల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ మరమ్మతులు చేపట్టిన సమయంలో గోపాలరావు విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. గోపాలరావును మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గుంటూరు ఆసుపత్రి అవుట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేశారు. గోపాలరావు మృతి పట్ల విద్యుత్‌శాఖ పెడన ఏడీఏ సీహెచ్ మాణిక్యలరావు, ఏఈ ఏడుకొండలు, లైన్‌మెన్‌లు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ కుద్స్ దినోత్సవం

మచిలీపట్నంటౌన్: ముస్లిం ప్రపంచం అంతటా ప్రతి సంవత్సరం రంజాన్ నెల చివరి శుక్రవారం జరుపుకునే అంతర్జాతీయ కుద్స్ దినోత్సవంను నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మత గురువులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మౌలానా మిర్జా రాషిద్ హుస్సేన్, మౌలానా జావ్వార్ హుస్సేన్, సయ్యద్ మసూద్ అబ్బాస్ రిజ్వి, మౌలానా హసన్ రాజా కరీమీ, మౌలానా రఫీఖ్, జామియా మస్జిద్ అధ్యక్షులు అంజద్ భాషా గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ మద్దీన్ గారు, టీడీపీ నాయకులు భాజాన్ గారు, జమాతే ఇస్లామి హింద్, మచిలీపట్నం శాఖ నాయకులు నాయకులు అలీ హుస్సేన్, ముస్లిం ఐక్యవేదిక కృష్ణా జిల్లా నాయకులు అబ్దుల్ అజీజ్, సిపిఎం నాయకులు కొడాలి శర్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కుర్చీలు, కంప్యూటర్ అందజేత

పెడన: మండల పరిధిలోని పెనుమల్లి జిల్లా పరిషత్ హైస్కూలుకు దక్కన్ ఫైన్ కెమికల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో కుర్చీలు, కంప్యూటర్‌ను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యాక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలకు దాతలు చేస్తున్న సాయం అభినందనీయమన్నారు. కంపెనీ నుంచి 50 కుర్చీలు, ఒక కంప్యూటర్ సెట్, రెండు టేబుల్స్ సుమారు రూ.1,59,500 విలువైన వాటిని పాఠశాలకు విరాళంగా అందించడం సంతోషకరమన్నారు. అనంతరం పాఠశాలలో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిందిగా ఉపాధ్యాయులు కోరారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, కంపెనీ ప్రతినిధులు గణపతి రాజు, రాంబాబు, శెలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జరిగే ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన ఆరు అంశాలపైన, ఆమోదించడం వంటి విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సభ్యులు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆమె కోరారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

ఐబీ జోనల్ మేనేజర్ రాజేష్

మచిలీపట్నంటౌన్: డ్వాక్రా మహిళలకు తమ బ్యాంక్ ద్వారా రుణాలను సకాలంలో అందించి వారు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్ అన్నారు. బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో నగరపాలక సంస్థలోని మెప్మా విభాగానికి నూతన కంప్యూటర్ సిస్టమ్‌ను ఆయన కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ పరిధిలోని బ్రాంచ్‌లలో డ్వాక్రా మహిళలకు రుణాలు సకాలంలో అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. తీసుకున్న రుణాలను ఆయా డ్వాక్రా సంఘాల వారు సక్రమంగా చెల్లిసూ రుణాలుగా పొందాలని తెలిపారు. మెప్మా సీఎంఎం కేవీఎస్ ఆనంద్‌బాబు, ఇండియన్ బ్యాంక్ డెప్యూటీ జోనల్ మేనేజర్ డి.రామారావు, ఎల్‌డీఎం సీ రవీంద్రరెడ్డి, మచిలీపట్నం బ్రాంచ్ మేనేజర్ కే ప్రవీణ్‌కుమార్, మెప్మా సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

నిర్వహణ హక్కులకు బహిరంగ వేలం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో వివిధ కేటగిరీల్లో లైసెన్సు హక్కు పొందేందుకు ఆలయ ప్రాంగణంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 ఒక సంవత్సర కాలపరిమితికి లైసెన్సు వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలంలో వాహనాల పార్కింగ్ రుసుము వసూలు చేసుకునే లైసెన్సుకు మోపిదేవి వాస్తవ్యులు కొల్లి మురళీకృష్ణ రూ.15,40,000లకు లైసెన్సు హక్కు పొందినట్లు తెలిపారు. యాత్రికుల వస్తు సామగ్రి భద్రపర్చుకునేందుకు క్లోక్ రూము లైసెన్సు హక్కు నకు మోపిదేవికి చెందిన కొల్లి మురళీకృష్ణ రూ.7,52,000లకు లైసెన్సు పొందినట్లు వివరించారు. కోడూరు గ్రూపు టెంపుల్ ఈవో సీహెచ్ సుధాకరావు, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో విచారణ

పెడన: పట్టణంలోని ఆరో వార్డులో వివాదస్పందంగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో జిల్లా అధికారులు శుక్రవారం విచారణ నిర్వహించారు. అంబేద్కర్ వర్ధంతి, జయంతి తదితర కార్యక్రమాల సందర్భంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయనీయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని స్థానిక ఎస్సీలంతా ఎస్టీ, ఎస్సీ కమిషన్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మచిలీపట్నం అసిస్టెంట్ ఎస్సీ వెల్ఫేర్ అధికారిణి వైవీఎన్ మల్లేశ్వరి, జైభీమ్ వ్యవస్థాపకుడు జక్కుల ఆనంద్ బాబు, పాలపర్తి ఫణీంద్ర, కొడూరి భార్గవ్ తదితరులు స్థానిక ప్రజల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుని రికార్డు చేసుకున్నారు. పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి, గూడూరు ఎస్ఐలు గణేష్‌కుమార్, సత్యనారాయణలతో పాలు పోలీస్‌బందోబస్తు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నిర్మాణంపై హైకోర్టులో కేసు నడుస్తోందని, ప్రస్తుత స్థితిని కొనసాగించాలనిపేర్కొవడంతో ఇక్కడ ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించనీయకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని సీఐ విచారణ తెలియజేశారు. ఇరు పక్షాల నుంచి విచారణ అధికారులు లిఖితపూర్వకంగాస్టేట్‌మెంట్లు తీసుకున్నారు.


కానూరు పీఏసీఎస్ కంప్యూటరీకరణ

కానూరు(మచిలీపట్నంరూరల్): మచిలీపట్నం పరిధిలోని కానూరు పీఏసీఎస్‌ను 2025–26 సంవత్సరం నుంచి కంప్యూటరీకరణ చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తెలిపారు. శనివారం పీఏసీఎస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పిచ్చేటి రాము అధ్యక్షతన సంఘం మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ ఖర్చులు, సమయం దాటినప్పటికీ చెల్లించని లోన్లపై చర్చించారు. సంఘాన్ని కంప్యూటరీకరణ చేయటం వల్ల సభ్యులందరికీ కంప్యూటర్ ప్రింట్ రశీదులు ఇవ్వొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శ్రీకాకోళపు నాగేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో గుడివాడ గురురాజు ప్రభుత్వ హోమియో కాలేజీ వైద్యులు లక్ష్మి పాల్గొని పరీక్షలు చేసి మందులు సిఫార్సు చేశారు. జూనియర్ డాక్టర్లు రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో కేంద్రం సభ్యులు ఏ.రమణ, పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలోని వక్కపాటి అంజిబాబు పెరట్లో స్వయంగా ఏర్పడ్డ పుట్ట వద్ద సుబ్రహ్మణ్యస్వామి 5వ వార్షికోత్సవ పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితులు ఆసూరి రంగనాధాచార్యులు (చిన్నస్వామి) శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఉదయం జంటనాగుల విగ్రహానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు పంచామృతాలతో నిర్వహించారు. అనంతరం పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంజిబాబు, మాధురి పలువురు దంపతుల దీక్ష ధారణలతో రుద్ర హోమం, సుబ్రహ్మణ్య హోమాలు నిర్వహించి అనంతరం పూర్ణాహుతి చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు బారులు తీరారు. తర్వాత నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.